క్లుప్తంగా

కారంచేడు మృతవీరుల సంస్మరణ సభ నేడు

టంగుటూరు: స్థానిక బొమ్మల సెంటర్‌లో కారంచేడు మృతవీరుల సంస్మరణ దినోత్సవం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నారు. ఈమేరకు దళిత రైట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు తుల్లిబిల్లి ఆశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి దళిత బహుజనులు, అంబేడ్కర్ వారసులు పాల్గొనాలని, దేశంలో దళితులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ సభ జరుగుతుందన్నారు.

సూర, ముక్క కొనుగోళ్లు ప్రారంభం



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం పొగాకు సూర, ముక్క కొనుగోలు ప్రారంభమయ్యాయి. 20వ తేదీతో ముగుస్తుందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. పొగాకు చూర అత్యధిక ధర రూ. 150 పలికింది. చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం, కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాల రైతులు 485 పొగాకు సూర, ముక్క బేళ్ళను వేలాని తీసుకుని వచ్చారు. వాటిలో 466 కొనుగోళ్లు జరగగా, 19 బేళ్లు తిరస్కరకు గురయ్యాయి. గరిష్ట ధర రూ. 150 కాగా, కనిష్ట ధర రూ. 60 పలికింది. సరాసరి రూ. 90.45 ధర పలికింది.

విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధే లక్ష్యం



విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ సుభద్ర

సింగరాయకొండ: విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధి కోసం కృషి చేయాలని డీఈఓ డి. సుభద్ర అన్నారు. మండల కేంద్రంలోని వెస్ట్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించి మధ్యాహ్న భోజనం తిని కుకింగ్ ఏజెంట్లకు తగిన సూచనలు చేశారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలను, ఎంఈఓ కార్యాలయాన్ని పరిశీలించారు. హెచ్‌ఎం పి. అండాళ్లు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సికిల్ సెల్ అనీమియాపై జాగ్రత్తగా ఉండాలి



రక్త పరీక్షలు చేస్తున్న హెల్త్ సిబ్బంది

వలేటివారిపాలెం: సికిల్ సెల్ అనీమియాపై జాగ్రత్తగా ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత అన్నారు. మండలంలోని అత్తంటివారిపాలెం అంగన్‌వాడీ సెంటర్ -1లో సీడీపీఓ శర్మిస్తా సూచనలు మేరకు సూపర్‌వైజర్ సునీత అధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ జన్యుపరమైన మార్పులు వచ్చే ఈ రక్త హీనత జబ్బుకు సరైన మందులు లేవని అవగాహన కల్పించారు. ఏఎన్ఎం అనిత, ఎంఎల్‌హెచ్‌పీ మదుషా, ఆశావర్కర్ వరలక్ష్మి, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం
పెద్ద షరిగత్ వేడుకలు



సయ్యద్ మకాన్ వద్ద పూజలందుకుంటున్న అక్బర్‌వలి (గజ్జల పీరు)



చావిడ్ల వద్ద భక్తుల రద్దీ

● భక్తులతో కిటకిటలాడిన పీర్ల చావిడ్లు

కనిగిరి రూరల్: ఇమామే హసన్, ఇమామే హుస్సేన్, ఇమామే ఖాశిం వంశీకుల త్యాగ నిరతికి ప్రతీకగా, మత సామరస్యానికి ప్రతీకగా.. జరుపుకునే మొహర్రం(పీర్ల పండుగ) పెద్ద షరిగత్ వేడుకలను మంగళవారం రాత్రి కనిగిరిలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కనిగిరి ప్రాంతంలోని వివిధ పీర్ల చావిడీలలో కొలువై ఉన్న పీర్లకు విశిష్ట పూజలు చేశారు. సయ్యద్ మకాన్, మయాన(పఠాన్) మకాన్, మంగలిమాన్యం, దేవాంగ నగర్, శంఖవరం, గురువాజీపేట తదితర పీర్ల చావిడ్ల వద్ద భక్తులు కిటకిటలాడారు. ఇమామే హసన్, ఇమామే హుస్సేన్, ఇమామే ఖాశీం, అక్బర్‌వలి, బారా ఇమామ్ తదితర నామకరణాలు కల్గిన (పీర్లకు) హాజరత్‌లకు ఎంతో నియమ నిష్ఠలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కుల, మత వర్గాలకతీతంగా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా పీర్ల చావిడీలను విద్యుత్ దీప, పూలంకరణలతో సుందరంగా అలంకరించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పీర్ల చావిడిల వద్ద పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేశాయి. ఈ దృశ్యాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అనంతరం పీర్లను పట్టణ పురవీధుల్లో తప్పెట్ల తాళాలతో ఊరేగించారు. అలాగే మండలంలోని గురువాజీ పేట, గానుగపెంట, బడుగులేరు, దిరిశవంచ తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి.



మయాన మకాన్‌లో పీర్లకు పూజలు



పీర్ల చావిడి వద్ద అగ్ని గుండం



హాజీపురంలో పీర్లకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మీహోమం



సామూహిక కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పామూరు: కోదండరామస్వామి తిరునాళ్ల సందర్భంగా పామూరు అంకాళమ్మవీధి సమీపంలోని వడ్డెపాలెం రామాలయంలో మంగళవారం శ్రీమహాలక్ష్మీ హోమం, సామూహిక కుంకుమార్చన అర్చకుల వేద మంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతిపూజ, సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. హనుమత్‌హోమం, మూర్తి హోమం, వాస్తుహోమం నిర్వహించారు. హోహం, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

భక్తిశ్రద్ధలతో పీర్ల చావిడి వద్ద ప్రార్థనలు

పామూరు: మొహర్రం (పీర్లపండుగ)లో భాగంగా మంగళవారం పామూరు తూర్పువీధి పీర్లచావిడి చెట్టు వద్ద భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు చావిడి కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీచేశారు.



పీర్ల చావిడి చెట్టు వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



ఆధార్ నమోదు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్, ఐటీడీఏ పీఓ

కందుకూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు పేదలకు అందేలా చూస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డు ఏకలవ్య నగర్ ఎస్టీ కాలనీలో విద్యాశాఖ, జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం సబ్‌కలెక్టర్ విద్యాధరి, ఐటీడీఏ పీఓ పరిమళతో కలిసి ఆయన ప్రారంభించారు. గతంలో ఇక్కడ పర్యటించినప్పుడు ఆధార్‌కార్డు లేక అనేక మంది గిరిజనులు సంక్షేమ పథకాలకు దూరమైనట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం ఈ విషయాన్ని సబ్‌కలెక్టర్ విద్యాధరి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆమె గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఆధార్‌నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారని వివరించారు. ఏ ప్రభుత్వ పథకం పొందాలన్నా ఆధార్‌కార్డు అనేది తప్పనిసరి కావడంతో ఆధార్‌లు లేక గిరిజనులు పథకాలకు దూరంగా ఉంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో ఆధార్‌కార్డుతో పాటు, జనన ధ్రువీకరణ పత్రాలు, పాతకార్డులో తప్పులు సరిచేసుకోవడం వంటివి చేస్తారని తెలిపారు. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకుల సహకారంతో జీరో బ్యాలెన్స్ అకౌంట్‌లను కూడా వెంటనే ఓపెన్ చేయిస్తున్నామని చెప్పారు. సబ్‌కలెక్టర్ విద్యాధరి మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి ఆధార్ అవసరమని, విద్యార్థుల చదువులకు, స్కాలర్‌షిప్‌లకు, మెడికల్ బిల్లులు, రియంబర్స్‌మెంట్ వంటి సేవలకు అధార్ తప్పనిసరి అని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఎర్రవడ్డిపాలెం, తూర్పు వడ్డిపాలెం, గుర్రంవారిపాలెం, జనార్దన కాలనీల్లో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కేంద్రాలు పనిచేస్తాయని చెప్పారు.

కుష్టు వ్యాధి సర్వేపై అవగాహన



పెట్లూరు వైద్యశాలను తనిఖీ చేస్తున్న డీపీఎంఓ వాణిశ్రీ

కొండపి (సింగరాయకొండ): మండలంలోని పెట్లూరు పీహెచ్‌సీ, చోడవరం, వెన్నూరు హెల్త్ సెంటర్‌లను మంగళవారం జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ టి.వాణిశ్రీ తనిఖీ చేశారు. డయేరియా, డెంగీ వ్యాధులపై సిబ్బంది ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు? ఐదు సంవత్సరాల పిల్లలు, తల్లులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్‌లు అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఈ నెల 18 నుంచి ఆగస్టు 02వ తేదీ వరకు జరగనున్న కుష్టు వ్యాధి సర్వేపై సిబ్బందికి అవగాహన కల్పించారు. పెట్లూరు పీహెచ్‌సీ వైద్యురాలు పి.అనూష, రవిబాబు, మోహన్ రావు, లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక నిర్ణయాలు విడనాడండి

పొదిలి: కార్మిక వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి పి.ఓబులేసు ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షల్లో మంగళవారం పీఎస్.రావు, చంద్రకళ, బి.బ్రహ్మయ్య దీక్షలో కూర్చున్నారు. వీరికి దండలు వేసిన వెంకటరావు దీక్షలు ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ డిపోలో మూడు సంవత్సరాల నుంచి చార్ట్‌లు వేయకుండా అధికారులు డ్రైవర్లు, కండక్టర్లను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఎక్స్‌ప్రెస్ పేరుతో కనిగిరి డిపోకు పంపించిన డ్రైవర్లను వెంటనే మాతృ డిపోకు వచ్చేలా చేసి లీవ్ పొజిషన్ కల్పించాలన్నారు. సకాలంలో ఇంక్రిమెంట్లు కలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిస్పాచ్ మెకానిక్ కృష్ణ డ్రైవర్లపై పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. అహర్నిశలు సంస్థ బాగు కోసం కష్టపడుతున్న ఉద్యోగులను నిబంధనలకు విరుద్ధంగా చిన్న పాటి తప్పులకు కూడా ఆర్థిక నష్టం కలిగించే చర్యలు చేపడుతున్నారన్నారు. అక్రమ మస్టర్లు ఇచ్చి సంస్థకు ఆర్థిక నష్టం చేకూర్చుతున్న ఎస్‌టీఐపై ఎటువంటి చర్యలు లేవన్నారు. ఏఎంటీ కార్యాలయంలో హెయిర్ బస్సులకు సంబంధించిన ఎస్‌ఆర్‌లు లేకపోతే ఇప్పటి వరకు అధికారులు ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. డిపోలోని లోపాల గురించి ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లినా, సంబంధిత సూపర్‌వైజర్లపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఈ నిరాహార దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఎండీఏ బాజీ, గౌరవాధ్యక్షుడు ఎం.షరీఫ్, కోశాధికారి ఎస్‌కే.జిలానీ, అసిస్టెంట్ సెక్రటరీ ఎస్‌కేకే బాష, జాయింట్ సెక్రటరీ ఏ.దివాకర్, మహిళా కమిటీ సభ్యులు ఎంపీసీ కళ, సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారికి కోటి కుంకుమార్చన

పొదిలి: స్థానిక శ్రీశ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కోటికుంకుమార్చన పూజలు జరుగుతున్నాయి. లోక కళ్యాణం కోసం జరిగే ఈ పూజలు మంగవారం నాటికి 25వ రోజుకు చేరుకున్నాయి. ఉభయదాతలను ఆలయంలోకి సాదరంగా ఆహ్వానించి, ప్రత్యేక పూజలు చేయిస్తున్నారు. శాలువాలతో సత్కరిస్తున్నారు. భక్తులకు లక్కీడ్రా తీసి గెలుపొందిన వారికి చీర బహుకరిస్తున్నారు. ఆలయ అర్చకులు దీవి శ్రీకాంత్ భట్టర్, సలహాదారులు మురళీ కృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, ఎస్. నాగేశ్వరరావు, పెరుమాళ్ల భాస్కర్, సాయి, మల్లయ్య, పొనుగుపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి



వెలిగండ్లలో హెల్మెట్ వాడకంపై ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై

వెలిగండ్ల: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని ఎస్సై ఎం శివ అన్నారు. వెలిగండ్లలో మండల న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించడంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎం శివ మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా ప్రయాణించడంతో ప్రమాదాలు జరిగినపుడు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. హెల్మెట్ ధరించండి, ప్రాణాలు కాపాడుకోండి అంటూ నినాదాలు ఇస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ జి.అచ్చిరెడ్డి, ఎస్ శ్రీనివాసులు, పారాలీగల్ వలంటీర్లు, జీఎస్అండ్‌జీడీకే ఫౌండేషన్ చైర్మన్ గంధం సామ్యూల్ గెర్షోమ్, న్యాయసేవాసంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతకు కృషి



సోమరాజుపల్లి గ్రామానికి వచ్చిన జరుగుమల్లి మండల అధికారుల బృందం

సింగరాయకొండ: గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జరుగుమల్లి ఎంపీడీఓ జలజాక్షి తెలిపారు. మండలంలోని సోమరాజుపల్లిలో మంగళవారం గ్రామీణ స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. జలజాక్షి మాట్లాడుతూ ఈ గ్రామం పూర్తి స్థాయి మరుగుదొడ్లు నిర్మించిన గ్రామంగా 2021లో గుర్తింపు పొందిందని చెప్పారు. నలుగురు అధికారులతో కూడిన బృందం.. పారిశుద్ధ్య పనులు, డ్రైనేజీ పరిస్థితి, చెత్త తయారీ కేంద్రం నిర్వహణ వంటి వాటిని పరిశీలించినట్లు చెప్పారు. మరుగుదొడ్లు అవసరమైన వారి వివరాలు నమోదు చేసుకున్నామని వివరించారు. జరుగుమల్లి ఈఓఆర్‌డీ అంజలీదేవి, ఏపీఎం భాగ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మామిడిలో కొమ్మ కత్తిరింపులు ముఖ్యం



వీరేపల్లిలో రైతులకు సలహాలిస్తున్న ఉద్యానశాఖాధికారి జ్యోతి

● ఉద్యాన శాఖాధికారి జ్యోతి

ఉలవపాడు: మామిడిలో కొమ్మ కత్తిరింపులు ముఖ్యమని ఉద్యానశాఖాధికారి జ్యోతి తెలిపారు. మండల పరిధిలోని వీరేపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం మామిడి రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడిలో పంట కోత అనంతరం తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. తోటల్లో పాదులు చేయడం, సూర్యరశ్మి కోసం కొమ్మ కత్తిరింపులు చేసుకోవాలని సూచించారు. సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మామిడి లో ఫ్రూట్ కవర్ల ఉపయోగాలు, వాటి ఆవశ్యకత గురించి వివరించారు. రైతులు మామిడితో పాటు ఇతర ఉద్యాన పంటలు కూడా పండించడంలో ఆసక్తి చూపించాలని తెలిపారు. ఉద్యాన శాఖలో 2024-25 ఖరీఫ్ సీజన్‌లో నూతన తోటల పెంపకం, హైబ్రిడ్ కూరగాయల పెంపకం, రైతులకు అందుబాటులో ఉన్న రాయితీల గురించి వివరించారు. ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలోని జరుగుమల్లి, కె. బిట్రగుంట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ హర్షీష్ ఒక ప్రకటనలో తెలిపారు. జరుగుమల్లి, వావిలేటిపాడు, పంగులూరివారిపాలెం, చింతలపాలెం, దావగూడూరులో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కె. బిట్రగుంటలోని 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటులో భాగంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

సీసీఆర్ కార్డులతో బహుళ ప్రయోజనాలు



లింగసముద్రం: రైతులకు సూచనలిస్తున్న ఏఓ అబ్రహంలింకన్



ఓగూరులో మాట్లాడుతున్న ఏఓ రాము



టంగుటూరులో మాట్లాడూతున్న తహసీల్దార్ కుటుంబరావు

లింగసముద్రం: పంట సాగు హక్కు పత్రాలతో(సీసీఆర్‌సీ) కౌలు రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయాధికారి టి.అబ్రహంలింకన్ అన్నారు. మండలంలోని వీఆర్‌కోట, అన్నెబోయినపల్లె రైతు సేవాకేంద్రాల్లో మంగళవారం గ్రామసభలను నిర్వహించారు. పంట సాగు హక్కు పత్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు రైతుసేవాకేంద్రాల్లో వారి పేర్లను నమోదు చేసుకుని హక్కు పత్రాలు పొందాలని సూచించారు. కార్డులు ఉన్నవారు పంట రుణాలు, బీమా, పంట నష్టపరిహారం వంటి ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారులు అమనుల్లాఖాన్, ప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్‌కే నజీర్ అహ్మద్, రైతులు పాల్గొన్నారు.

కందుకూరు: పొలాలను కౌలు తీసుకుని సాగు చేస్తున్న కౌలు రైతులను గుర్తించి కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నట్లు వ్యవసాయాధికారి వి.రాము తెలిపారు. మంగళవారం ఓగూరులో జరిగిన సాగు ధ్రువీకరణ పత్రాలు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పంట సాగు చేసే ప్రతిరైతు కచ్చితంగా గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి పొలం యజమాని పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డులు, కౌలు రైతు ఫొటోతో దరఖాస్తు చేసుకుంటే కౌలు రైతులు సాగు ధ్రువీకరణ పత్రం పొందవచ్చునని తెలిపారు. పంట సాగు ధ్రువీకరణ పత్రం అనేది భూ యజమానులకు, పంట సాగుదారులకు మధ్య జరిగే ఒక ఒప్పందం అని, దీని కాలపరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందని తెలిపారు. కౌలు రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు కె. శరత్‌కుమార్, గ్రామ రెవెన్యూ అధికారి ఎ శివశంకర్, కార్యదర్శి నాగదుర్గ పాల్గొన్నారు.

కౌలు కార్డులతో అన్నదాతలకు ఉపయోగం

టంగుటూరు: రైతులంతా కౌలు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని తహసీల్దార్ కుటుంబరావు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో వ్యవసాయాధికారి స్వర్ణలత అధ్యక్షతన పంట సాగుదారు హక్కు పత్రాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలు కార్డులుంటే పంటపై పూర్తి హక్కులు లభిస్తాయని.. అయితే భూ యజమానులకు మాత్రం ఎటువంటి నష్టం వాటిల్లదని తెలిపారు. వ్యవసాయాధికారి స్వర్ణలత మాట్లాడుతూ భూమి లేని కౌలు రైతులు కవులు కార్డులు తీసుకోవడం వలన ప్రభుత్వం పథకాలు పంట నష్టపరిహారం, పంట బీమా, బ్యాంకు రుణాలు వంటివి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్డు పరిమితి 11 నెలల వరకు ఉంటుందని ముగిసిన అనంతరం రెన్యువల్ చేసుకోవాలన్నారు. మక్కెన కోటేశ్వర రావు, బి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.